
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ 3 జిల్లా వార్తలు
గురువారం 11 జూలై 2024






రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు

రిజిస్ట్రేషన్ల సందడి

- కార్యాలయాల్లో ఆషాఢంలోనూ తగ్గని రద్దీ
- మార్కెట్ విలువలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం
- ఆలోపే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న క్రయవిక్రయదారులు

కరీంనగర్ క్రైం, జూలై 10 : కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ విక్రయదారులతో సందడి నెలకొంది. త్వరలో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల ప్రభుత్వ మార్కెట్ ధరలు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో క్రయవిక్రయదారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ఇతరులు ఇప్పటికే ఆస్తుల ఒప్పందం చేసుకున్నవారు ముందస్తుగా రిజిస్ట్రే షన్లు చేసుకుంటున్నారు. సాధారణంగా ఆషా ఢంలో మంచి రోజుల ఉండవని రిజిస్ట్రేషన్లు వాయిదా వేసుకుంటారు. మంచిరోజులు లేనప్పటికీ ప్రభుత్వం మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఫీజు పెంచే అవకాశముందన్న వార్తలతో క్రయ విక్రయదారులు ఇంకా రిజిస్ట్రేషన్‌కు గడువు ఉన్నప్పటికీ ముందస్తుగానే రిజిస్ట్రేషన్లకు వెళుతున్నారు. కరీంనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రోజు సరాసరిగా 30 నుంచి 45 ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగేవి. వారం రోజులుగా 50 నుంచి 55 రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. ప్రభుత్వం భూములు, ఇళ్ల స్థలాల మార్కెట్ విలువను 30 నుంచి 50 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు గ్రామాలు, పట్టణాలు, జాతీయ, రాష్ట్ర రహదారులకు అనుకుని ఉన్న భూములు, స్థలాల బహిరంగ మార్కెట్ విలువలు ఎంత ఉన్నాయి? ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ విలువ ఏ మేరకు ఉంది? రెండింటి మధ్య వ్యత్యాసం ఎంతనేది సవివరంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని రాష్ట్ర వ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో భూముల బహిరంగ విలువలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు అందజేసినట్లు సమాచారం. జిల్లా అధికారుల నుంచి ప్రభుత్వానికి కూడా నివేదికలు వెళ్లినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాన్ని పరిశీలించిన తరువాత సామాన్యులకు భారం కాకుండా, రియల్ ఎస్టేట్‌పై ప్రభావం పడకుండా కొత్త విధానాన్ని, మార్కెట్ విలువలను పెంచాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరో వైపు రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచవద్దనే ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. 2021, 2022లో భూముల మార్కెట్ విలువలు పెంచారు. ఇప్పుడు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు పెంచకుండా అలాగే కొనసాగించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఒక సేల్‌డీడ్‌కు స్టాంపుడ్యూటీ 5.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5 నుంచి రెండు శాతంగా ఉంది. భూముల అమ్మకాల్లో సేల్‌డీడ్, గిఫ్ట్‌డీడ్, మార్ట్‌గేజ్, తదితర రకాలుండగా ఒక్కో రకం రిజిస్ట్రేషన్‌కు స్టాంపుడ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఉంటుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మాత్రం మార్కెట్ విలువలను పంచవద్దని, దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోతుందని, తద్వారా ప్రభుత్వానికి రాబడి తగ్గే అవకాశాలుంటాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు మధ్యతరగతి, పేదవర్గాలు స్థలాల కొనుగోలుపై ఈ మార్కెట్ విలువ పెంపుతో భారం పడుతుందని చెబుతున్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో . ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

సుభాష్‌నగర్, జూలై 9: కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తుందన్నారు. బొగ్గుబ్లాకుల వేలానికి పూనుకుందని, ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరే విధానాలను విరమించుకోవాలని గతంలో పార్లమెంట్‌లో ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయకముందే బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు రంగంలోకి దిగిందని విమర్శించారు. కార్మికుల ఈపీఎఫ్ చెల్లింపు బకాయిలు జాప్యంలో యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోని వచ్చి ఆరు నెలలు గడిచినా ఆ హామీలు అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పారిశ్రామికవేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో అనేక సార్లు సమావేశాలు నిర్వహించారని అన్నారు. ఎరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీవోలు విడుదల చేసిందని, అందులో కష్ట జీవులకు ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని పత్రికలకు లీకులు ఇస్తున్నదని, ఇది కార్మిక వర్గానికి ప్రమాదమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, కరీంనగర్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కవ్వంపల్లి రవి, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సరిత, సహాయ కార్యదర్శి సరోజ, సదాలక్ష్మి, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, గ్రామ పంచాయతీ వర్కర్స్‌యూనియన్ నాయకుడు అంజయ్య పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి..

- చిన్నారులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు..
- బాలకార్మికులను గుర్తించండి..
- కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, జూలై 10: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఈ నెల 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు, కార్మికశాఖ అధికారులతో పాటు పలువురు అధికారులతో బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుంచి తప్పిపోయిన, పారిపోయిన, భిక్షాటన చేసే 14 సంవత్సరాల్లోపు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తర్వాత వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులకు సంబంధించిన వివరాలు అందించేందుకు గాను ఒక ఫోన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ నంబర్‌పై జిల్లాలో అన్ని పట్టణాలు, గ్రామాలు, వాడవాడలా ప్రచారం కల్పించాలని సూచించారు. ఇప్పటివరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో ఎంతమంది చిన్నారులను గుర్తించారు, వారి సంరక్షణ, తీసుకున్న చర్యలు, కేసుల నమోదు వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ శామ్యూల్, బీసీడీవో అనిల్ ప్రకాష్ పాల్గొన్నారు.

● ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

కరీంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం పరిశీలించారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈవీఎంలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు భద్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ ఏవో సుధాకర్, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ రమేష్, కాంగ్రెస్ ప్రతినిధి జాగిరం శ్రీకాంత్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 326 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారందరికి విద్యను బోధించేందుకు ఐదుగురు ఉపాధ్యాయుల మాత్రమే పని చేస్తున్నారని ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటినుంచి ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించకపోవడంతో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి మా పిల్లలకు చదువులను నేర్పించాలంటూ పిల్లల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అక్కడి చేరుకుని ధర్నా చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని బదిలీలు ముగిసిన వెంటనే మీ పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ధర్నాను విరమించారు.


సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బొమ్మశ లక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న ప్లాట్‌ను అక్రమంగా తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వివరాల ప్రకారం అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ తిప్పాపూర్ గ్రామంలో ప్లాట్‌ను విక్రయించి తన కూతురు వివాహం చేయాలని చూసింది. దీంతో సదరు ప్లాట్‌ను వేములవాడ పట్టణానికి చెందిన వోడ్యాల వేణు అనే వ్యక్తి తనకు విక్రయిస్తే రూ.6 లక్షలు ఇస్తానని నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. లక్ష్మికి ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే 2022లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ ప్లాట్‌ను ఎల్లారెడ్డిపేట మండలంకు చెందిన ఓ వ్యక్తికి అమ్మినట్లు తెలువగా పెద్ద మనుషులతో మాట్లాడి రూ. 8.50 లక్షలు ఇస్తానని ఒప్పుకుని ఒక లక్ష మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో తిడుతూ చంపుతానని బెదిరించడంతో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ విచారణ చేసి నేరం రుజువు కావడంతో వేణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతే కాకుండా అతనిపై గతంలో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్‌లలో పలు చీటింగ్ కేసులు నమోదు నమోదయ్యాయని, బెదిరింపుల కేసులు, భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్‌మెంట్ చేయడం వంటి కేసులతో పాటు అటెంప్ట్ మర్డర్ కేసులు ఉన్నాయని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండడానికి రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య(60) ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బుధవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. లక్ష్మయ్యను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఇరు కుల్లలో 2002లో సాదాబైనామా కాగితం ఒప్పందంతో ఇరుకుల్లకు చెందిన బుర్ర ఓదయ్య వద్ద 4 గుంటల భూమిని 8 లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేయగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు విక్రయదారు మళ్లీ రెండు లక్షలు డిమాండ్ చేయటంతో పాటు దూషించాడని మనస్థాపం చెంది తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కూతురు స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నలుగురిపై వీధి కుక్కల దాడి

సుభాష్‌నగర్, జూలై 10: కరీంనగర్ గంజ్ సమీపంలోని ఓ స్కూల్ దగ్గర వీధి కుక్కలు ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను వెళ్లకొట్టారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ధర్నా

హుజూరాబాద్, జూలై 10: కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పార్లమెంట్‌లో ఆమోదించుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను, బొగ్గు బ్లాక్‌ల వేలంను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. నాయకులు అజ్జు, సరోజన, రాజ్‌కుమార్, నర్సయ్య, సులోచన, రాజేశ్వరి, లత, పుష్పలత పాల్గొన్నారు.

నేషనల్ హైవే వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలే ఎక్కువ

శంకరపట్నం, జూలై 10: హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఫోర్‌లైన్ జాతీయ రహదారికి మట్టి తరలిస్తున్న వాహనాల ద్వారానే ప్రమాదాలు ఎక్కువ జరిగాయని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఓవర్ లోడ్, అధిక స్పీడ్‌తో వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల తీరును చూసి జడ్జి దిగ్భ్రాంతికి లోనయ్యారని సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని జడ్జి సూచించారన్నారు.

ఓపీఎస్ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, జూలై 10: ప్రభుత్వ ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవకుండా ఉద్యోగ సేవలకు ప్రతిఫలంగా, సామాజిక భద్రత కల్పించేందుకు పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తదనుగుణంగా సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ విధానం అమలుకు ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 2004లో ఓల్డ్ పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం తెరపైకి తెచ్చారని, తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఓపీఎస్ అమలుకు దశాబ్దాలుగా పోరాటం చేసినా గత ప్రభుత్వం ఎలాంటి పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినప్పుడు పెన్షన్ పొందే అవకాశం లేకపోవడంతో అవసాన దశలో సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి పౌరునికి పెన్షన్ ఇవ్వాలనే ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న విధంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో సైతం పేర్కొన్నట్లుగా కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం విధానం అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రత అందించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవించగలిగే పరిస్థితులు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

● నిరుపయోగంగా వ్యవసాయ శాఖ, స్త్రీశక్తి భవనాలు ● వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



మరమ్మతులకు నోచుకోని వ్యవసాయ శాఖ భవనం



నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనం

కథలాపూర్, జూలై 10: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పనికి రాకుండా పోతున్నాయి. అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తారు. అయితే ప్రజలకు అనువుగా ఉండడమే కాకుండా సిబ్బందికి అనుకూలంగా ఉండే విధంగా నిర్మించాల్సి ఉండగా దాన్ని విస్మరించారనే చర్చ జరుగుతోంది.

మహిళా స్వశక్తి భవనం ఉపాధి హామీ పథకం కింద వెచ్చించిన సుమారు రూ.26 లక్షలతో ఆరేళ్ల క్రితం నిర్మించారు. అధికారులు, సిబ్బంది కోసం మూడు గదులు, సమావేశాల నిమిత్తం ప్రత్యేకంగా గది నిర్మించారు. అయితే ఆ సమయంలో ఇరుకుగా ఉన్న దర్వాజలు పెట్టడం వల్ల బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు కార్యాలయంలోకి తీసుకువెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలన్నీ నూతన భవనంలోకి మార్చడానికి వీలు లేని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడం వల్ల కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మించినా ఫలితం లేకుండా మారింది. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనం తలుపులు ఊడిపోయి, ఫ్లోరింగ్ చెడిపోవడం వల్ల కొంత కాలంగా భవనం తెరుచుకోవడమే లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయం లేక ఇటు సిబ్బంది, అటు రైతులు అవస్థలు పడుతున్నారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తేనే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం

నరహరి, సెర్ప్ ఏపీఎం



స్త్రీశక్తి భవనం పూర్తి చేసినప్పటికీ తమకు అందుబాటులోకి రావడం లేదు. దర్వాజాలు ఇరుకుగా నిర్మించినందువల్ల కనీసం కుర్చీలు కూడా భవనంలోకి తీసుకెళ్లలేని పరిస్థితి. ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మహిళలతో సమావేశాలు కూడా నిర్వహించడానికి వీలు లేదు. కొత్త భవనమే అయినా తాము వినియోగించుకోలేక పోతున్నాం. మరమ్మతులు చేయించాలని ఏపీడీతో చర్చించాం.ఇంజనీర్‌తో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు మరమ్మతులు నిలిపివేత

● ఆర్‌అండ్‌బీ అధికారుల నివేదిక కోరిన కలెక్టర్

హుజూరాబాద్, జూలై 10: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వాస్తు పేరిట అనాధికారికంగా మరమ్మతులు చేస్తుండగా బుధవారం పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఈ ఎమ్మెల్యే క్యాంపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం వాస్తు ప్రకారం లేదనే కారణంతో పోర్టికో, కిటికీలు, తలుపులను, గోడలను తొలగిస్తున్న విషయం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో పాటు స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే పనులను నిలుపుదల చేసి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ పనులు నిలిపివేయడంపై హుజూరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు నేరెళ్ల మహేందర్‌గౌడ్, బీజేపీ నాయకుడు బింగి కరుణాకర్‌లు బుధవారం ఆర్డీవో, ఏసీపీలకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 10: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరి వేసుకొని మృతి చెందగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత సంవత్సర కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డుకు చున్నీతో ఉరి వేసుకొని మంగళవారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వీర్నపల్లి, జూలై 10: అటవీ గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నివసించేందుకు పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారాం నాయక్ తండా, బండ తండాతోపాటు ఆయా తండాల ప్రధాన రహదారి వెంట ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలన్నారు. గంభీరావుపేట ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట హెడ్‌కానిస్టేబుల్ పాషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ ప్రాజెక్టులోకి 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 12.324 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.964 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 6.418 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



హన్మంతు (ఫైల్)

మానకొండూర్, జూలై 10 : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) అనే వ్యక్తి బుధవారం తన ఇంటి సమీపంలోని కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారిపై నుంచి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. పదిహేను రోజుల క్రితం పత్తి ధర రూ.7,300 పలికింది. క్రమేపీ పెరుగుతూ వస్తూ ప్రస్తుతం రూ.7600 చేరుకుంది. బుధవారం మార్కెట్ యార్డుకు 17మంది రైతులు 293క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చారు. బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.7400 చెల్లించి ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

చెరువు ఆక్రమణపై అధికారుల విచారణ

మల్యాల, జూలై 10: మల్యాలలోని పలు చెరువులు ఆక్రమణకు గురి అవుతుండడంతో అధికారులు బుధవారం పరిశీలించి పలు ఫిర్యాదులపై విచారణ జరిపారు. మల్యాలలోని చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని కాపాడి తమ జీవనోపాధి కోల్పోకుండా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక గంగపుత్ర సంఘం సభ్యులు నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టి నింపుతుండడంతో విస్తీర్ణం తగ్గడమే కాకుండా చేపల పెంపకానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు మల్యాలలోని సూరప్ప, మత్తడి చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద మట్టి నింపుతున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో చర్యల కోసం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో డీఈ తిరుపతి, ఆర్‌ఐ తిరుపతి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 10 : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని శ్రీరామోజు స్వస్తిక్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కనగర్తికి చెందిన స్వస్తిక్ మధ్యాహ్నం ఓదెలకు వచ్చినట్లు సమాచారం. సాయంత్రం వేళల్లో రైల్వే స్టేషన్ వైపు వెళ్లిన వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ముఖం నుజ్జునుజ్జు అయ్యింది. కొన ఊపిరితో ఉన్న స్వస్తిక్‌ను 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉంది.

హాస్టల్స్, హోటల్స్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

ధర్మపురి, జూలై 10: ధర్మపురి పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ స్కూల్‌లో నాసిరకంగా ఉన్న చెడిపోయిప కూరగాయలను బయట పడవేయించారు. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హోటల్స్ బేకరీలను కూడ తనిఖీ జరిమానాలు విధించారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అన్నదానం, ప్రసాద విక్రయశాలను పరిశీలించి ప్రసాదాలను టెస్టింగ్ కోసం ఆమె వెంట తీసుకెళ్లారు. ప్రతీ ఒక్కరు నాణ్యత ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎస్‌ఆర్‌టీ అధికారి

కొడిమ్యాల, జూలై 10 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను బుధవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రేనింగ్(ఎస్‌ఆర్‌టీ) అధికారి భరణి ఆకస్మికంగా సందర్శించారు. మోడల్ స్కూల్‌లో పరిశుభ్రత, బోధన విధానం, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోధన తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అభినందించారు. ఈ సందర్శనలో ప్రిన్సిపాల్ బి లావణ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్

● బ్యాడ్మింటన్‌లో విజేత రామగుండం జట్టు



బ్యాడ్మింటన్ విజేత రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, జులై 10: రామగుండం ఎన్టీపీసీలో జరిగిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్(ఎస్‌ఆర్‌ఎస్‌ఎం) 2024లో బ్యాడ్మింటన్ విభాగంలో రామగుండం ఎన్టీపీసీ మహిళలు, క్రికెట్‌లో సింహాద్రి ఎన్టీపీసీ పురుషుల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న ఎస్‌ఆర్‌ఎస్‌ఎం బుధవారం ముగిసింది. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని స్పందన ఇండోర్ స్టేడియంలో జరిగిన మహిళల బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో రామగుండం జట్టు సింహాద్రి(విశాఖపట్నం) జట్టుపై విజయం సాధించింది. అలాగే మహాత్మాగాంధీ స్టేడియంలో రామగుండం, సింహాద్రి జట్ల మధ్య ఫైనల్ పోరులో సింహాద్రి ఎన్టీపీసీ గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రామగుండం ఎన్టీపీసీ జట్టు 90 పరుగులకే ఆలౌట్ అయింది. 91 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన సింహాద్రి ఎన్టీపీసీ జట్టు 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆర్‌ఈడీ(సౌత్) ప్రేం ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబర్చిన ప్లేయర్లకు బహుమతులను అందజేశారు. నాలుగు రోజులపాటు జరిగిన పోటీలలో రామగుండం, సింహాద్రి, కుడిగి(కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్‌ఆర్‌హెచ్‌క్యూ) హైదరాబాద్ ఎన్టీపీసీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆర్‌ఈడీ ప్రేం ప్రకాష్ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ ఉద్యోగులు క్రీడలపట్ల ఆసక్తి కనబర్చాలని, నిత్యం వ్యాయామం, నడక కొనసాగించాలన్నారు. ప్రధానంగా క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం కలుగుతుందన్నారు. రానున్న కాలంలో ఎస్‌ఆర్‌ఎస్‌ఎం పోటీలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఎస్‌ఆర్ హెచ్‌క్యూ సీజీఎం(హెచ్‌ఆర్) పాణిగ్రహి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ తివారి, భానేశ్వర్, హెచ్‌ఆర్ ఏజీఎం సిక్దర్, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెప్టింక్ ట్యాంకులో పడ్డ బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 10: పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సెప్టింక్ ట్యాంకులో పడి అస్వస్థతకు గురైన బాలుడు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన మహబూబ్‌నగర్‌కు చెందిన రాములమ్మ శ్రీనివాసుల కొడుకు జాన్‌వెస్లీ (7) మంగళవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడని మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలుడి కుటుంబీకులు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 10: ధర్మారం గ్రామానికి చెందిన అతికెం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఉదయం కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు తోటి గౌడ కులస్థులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 10: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www.tgbc-studycircle.cgg.gov.inలో ఈ నెల19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ ఈ నెల22న మొదలవుతుందన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లలో అందజేస్తారన్నారు. మరింత సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొన్న ఘటనలో బుధవారం మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ సొసైటీ గోదాం సమీపంలో అదే గ్రామానికి చెందిన నక్క గట్టయ్య అనే మతిస్థిమితం లేని వ్యక్తిని కారు ఢీకొట్టిందన్నారు. తీవ్ర గాయాలైన గట్టయ్యను స్థానికుల ఆస్పత్రికి తరలించారు.

నా పిల్లలన్నాడు.. మొహం చాటేశాడు

● జైలు జీవితం అనుభవించి సత్ప్రవర్తన కింద బయటకు ● పిల్లలను వదిలేసి వెళ్లిన తండ్రి



ఆశ్రమానికి వచ్చిన పూజ, బన్ని

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, జూలై 10: భార్య మృతి చెందిన కేసులో పద్నాలుగేళ్ల జైలు జీవితం అనుభవించిన ఓ తండ్రి ఆనాథాశ్రమంలో ఉన్న తన పిల్లల వద్దకు వచ్చాడు. ఇన్నాళ్లు పిల్లలకు దూరం అయ్యానని, నా అన్న వారు తెలియకుండా పెరిగారని, ఇకపై తన వద్ద పెట్టుకుంటానని, వారికి ఏ లోటు రాకుండా చూసుకుంటానని కల్లబొల్లి మాటలు చెప్పి వెంట తీసుకు వెళ్లాడు. రెండు రోజులు గడువక ముందే హైదరాబాద్ చెక్కేశాడు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య సత్తెమ్మ దంపతులకు కుమార్తె పూజ, కుమారుడు బన్ని ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర కోపోద్రిక్తుడైన సారయ్య భార్య సత్తెమ్మను వెనక్కి నెట్టడంతో మృత్యువాత పడింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో సారయ్యకు జీవిత ఖైదు పడింది. ఆ సమయంలో పూజ 5సంవత్సరాలు, బన్ని 4సంవత్సరాలు ఉన్నారు. పోలీస్‌ల సహకారంతో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన ఆనాథాశ్రమంలో పిల్లలను చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న సత్ప్రవర్తన కింద సారయ్యను విడుదల చేయగా నేరుగా ఆనాథాశ్రమంకు చేరుకున్నాడు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో ఇళ్లు అద్దెకు తీసుకున్నానని, పిల్లలను కూడా తన వెంట ఉంచుకుంటానని, ఇకపై వారికి ఏ లోటు రానివ్వనని కల్లబొల్లి మాటలు చెప్పి ఆశ్రమం నిర్వాహకుడిని నమ్మించాడు. ఈ నెల 4న పూజ, బన్నిలను తీసుకెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాద్ వెళ్లాస్తానని, జైలు అకౌంటెంట్ ఫోన్ చేశాడని, మనకు డబ్బులు వచ్చేవి ఉన్నాయని, తీసుకువస్తానని చెప్పి తెల్లవారు జామున 5గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు ఫోన్ చేసి మీరు నా పిల్లలు కాదు, నాకు పుట్టలేదు, సర్టిఫికెట్లపై నా పేరు తీసివేయాలని, తాను మరో వివాహం చేసుకుంటున్నానని, నా పేరిట ఉన్న కొద్దో గొప్పో ఆస్తిని వారికే ఇచ్చేస్తానని చెప్పి అతనిలో ఉన్న కసాయి తనాన్ని నిరూపించుకున్నాడు. ఒక్కసారి షాక్ గురైన పూజ, బన్నిలు కన్నీంటి పర్యాంతమై తనను చేరదీసిన ఆశ్రమం బాటపట్టారు. వారిని చూసి చలించిన ఆశ్రమం నిర్వాహకుడు గోపరాజు వీరస్వామి దగ్గరకు తీసుకుని ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. మీకు నేను ఉన్నా, మీరు అధైర్యపడద్దని ధైర్యం చెప్పి లోనికి తీసుకువెళ్లి భోజనం పెట్టాడు. వారి తండ్రి చేసిన పని తెలుసుకున్న తోటి పిల్లలు కోపంతో రగిలి పోయారు.

రామడుగు ఎస్ఐతో ప్రాణహాని

●వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య ఆరోపణ

సుభాష్‌నగర్, జూలై 10: రామడుగు ఎస్ఐతో తనకు ప్రాణహాని ఉందని వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్య, అతడి భార్య అనిత తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కుతాడి కనకయ్య మాట్లాడుతూ దొంగతనం విషయంలో తప్పుడు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి విచారణ చేయకుండా పోలీసులు తనను కొట్టి కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఏప్రిల్‌లో జరిగిన గొర్రెల దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, నేరాన్ని ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 11న ఇంట్లో నిద్రిస్తున్న తనను తెల్లవారుజామున 4గంటలకు రామడుగు పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని ఆరోపించాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి మళ్లీ కొట్టారని, లేవలేని స్థితిలో ఉన్న తనను జూన్ 12న రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారని తెలిపారు. 8 మంది కానిస్టేబుల్స్, ఒక ఎస్ఐ కలిసి తనను విపరీతంగా కొట్టారని ఆరోపించారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కుతాడి కనకయ్య కోరాడు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలంలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి తన భార్య రాజేశ్వరితో కలిసి మొలంగూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొలంగూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సంపత్ ఎదురుగా వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో పడాల వెంకటస్వామికి, సంపత్‌లకు స్వల్పగాయాలు కాగా 108వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో కరీంనగర్ రూరల్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. కాగా గ్రామంలో భారీగా ఇసుకను నిలువ చేసినట్లుగా మైనింగ్, పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది.

చోరీ కేసులో 8 నెలల జైలు శిక్ష

చిగురుమామిడి, జూలై 10: మండలంలో కొండాపూర్ గ్రామంలో గత సంవత్సరం నవంబరు 8 తేదీన ఇదే గ్రామానికి చెందిన దరిపల్లి లచ్చవ్వ అనే వృద్ధురాలిని మోసం చేసి పర్వతం రాజు అనే వ్యక్తి బంగారు అభరణాలు దొంగిలించిన కేసులో 8 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేస్తానని చెప్పి పర్వతం రాజు అనే వ్యక్తి ఆమె ఒంటిపై ఉన్న కమ్మలు, ఇతర బంగారు వస్తువులను దొంగలించి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు అయింది. దీనిపై ఎక్సైజ్ శాఖ కోర్టు నేరస్తునికి ఎనమిది నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటు ఎప్పుడో?

● మంజూరైనా స్థల సేకరణలో జాప్యం ● పొంచిఉన్న వ్యాధుల ముప్పు



పీహెచ్‌సీ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి(ఫైల్)

గన్నేరువరం, జులై 10: గన్నేరువరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం పక్క మండలమైన తిమ్మాపూర్, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మాపూర్‌కు 30 కిలోమీటర్లు, జిల్లా ఆసుపత్రికి 40 కిలోమీటర్ల దూరం వెళ్ళవలిసి వస్తుంది. అత్యవసర సమయాల్లో దూరభారంతో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. సాధారణ పరీక్షలకు వెళ్లే గర్భిణీలు పీఎచ్‌సీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో గన్నేరువరం, ఖాసింపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిని పల్లె దవాఖానాలుగా మార్చారు. వీటిలో గన్నేరువరం, జంగపల్లి సబ్‌సెంటర్ లకు ఎంఎల్‌ఎచ్‌పీలుగా ఉపేందర్, సాహితి డాక్టర్లను నియమించారు. మిగతా రెండు సబ్ సెంటర్‌లలో డాక్టర్లు లేక ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్‌లు ఉండగా ప్రస్తుతం వారు ఇరువురు వేరే మండలానికి బదిలీ కాగా మండలానికి హెల్త్ అసిస్టెంట్ లేకపోవడంతో ఏఎన్ఎంలపై భారం పడింది. ప్రస్తుతం తిమ్మాపూర్ పీఎచ్‌సీ డాక్టర్ ప్రణవ్ మండలానికి ఇంచార్జిగా ఉన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సైతం సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్థల సేకరణపై స్పష్టత కరువు


మండలానికి పీఎచ్‌సీ మంజూరుకావడంతో గత సంవత్సరం నవంబర్‌లో పీఎచ్‌సీ నిర్మాణం కోసం ఖాసింపేట చౌరస్తా వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అట్టి స్థలంలో పీహెచ్‌సీ నిర్మిస్తే మండలంలోని వివిధ గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటి వరకు పీహెచ్‌సీ నిర్మాణంపై ఎలాంటి స్పష్టత రాలేదు.

స్కైలాబ్ @ 45ఏళ్లు

చొప్పదండి,జూలై10: స్కైలాబ్‌కు నేటితో 45ఏళ్లు నిండాయి. 1979 జూన్, జూలై నెలలో పైనుంచి ఏదో పడుతుందని ఇక బతుకలేమంటూ అంతటా ప్రచారం జరిగింది. ఇక చనిపోతామంటూ ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు. స్కైలాబ్ అనే ఉపగ్రహం ఆకాశంలో గతి తప్పిందని భూమిపై కూలి పోతుందని శాస్త్రవేత్తలు ప్రకటించగా ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయాయి. ఇక బతుకలేమంటూ కొంతమంది విలువైన సంపదను విక్రయించుకొని విందులు చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోనే స్కైలాబ్ పడుతుందని వదంతులు వ్యాపించాయి. 1979 జూలై 11న స్కైలాబ్ ఉపగ్రహాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో దింపామని రేడియోలో వార్తలు రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విందులు చేసుకున్నారు. ప్రజలందరూ స్కైలాబ్ పడ్డరోజున గడగడలాడిపోయారు. అయితే ఆ రోజు కొందరికి తీపిగుర్తుగా మిగిలిపోయింది.అప్పుడు పుట్టిన వారికి గ్రామాలలో స్కైలాబ్‌గా పేరు పెట్టుకున్నారు.

పేరులోనే ప్రత్యేకత

కందుల స్కైలాబ్ గౌడ్, మంగళపల్లి



స్కైలాబ్ పడ్డరోజు పుట్టడంతో తల్లిదండ్రులు స్కైలాబ్ గౌడ్‌గా నామకరణం చేశారు. అందరి కన్నా తన పేరులో ప్రత్యేకత కలిగి ఉండడం సంతోషంగా ఉంది. నేను పుట్టిన రోజున దేశమంతా గడగడలాడిపోయి అంతా ఊపిరిపీల్చుకోవడం గర్వకారణంగా ఉంది.

డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

కరీంనగర్ క్రైం, జూలై 10: విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి ఉజ్వలమైన భవిష్యత్‌ను, జీవితాలను నాశనం చేసుకోవద్దని నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ ఉపేందర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌పై అవగాహన సమావేశ జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ ఉపేందర్ మాట్లాడుతూ డ్రగ్స్ మూలంగా ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవల్సి ఉంటుందని అన్నారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్కొటిక్ బ్యూరో సీఐ కృష్ణమూర్తి, మూడో రాణా సీఐ జాన్‌రెడ్డి, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

గణేశ్‌నగర్, జూలై 10: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ మీడియా కన్వీనర్ కటకం లోకేష్, మహమ్మద్ ముజిబ్ ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాపర్తి ప్రసాద్, చిట్టి బాబు, నాగసముద్రం ప్రవీణ్, నాంపల్లి శ్రీను, వాసు, సమీ, పర్వేజ్, సంపత్, కార్తీక్, తిరుపతినాయక్, అక్షయ్, భారత్, వెంకట్, బషీర్, పొన్నాల రాము, వెంకటసాయి, సంతోష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

సుభాష్‌నగర్, జూలై 10: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ దివ్యాంగుల విభాగం(బీఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడు శీలం రాజు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. రాజకీయ రిజర్వేషన్ 5 శాతం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. డబుల్ బెడ్ రూం శాతం ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 6 వేల ఫించన్ అందించాలన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు.

వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, జూలై 10: ఈ నెల 26 నుండి 28 వరకు జరిగే జిల్లా స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. బుధవారం నగరంలోని మంకమ్మతోట జిల్లా కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యా రంగ సమస్యలపై ఉద్యమిస్తు దేశ సమైక్యత సమగ్రతల కోసం కృషి చేస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యారంగ పరిరక్షణకై విద్యార్థులను సన్నద్ధ చేసేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, ఈసాక్, సందేశ్, నాయకులు గిరి చరణ్, అక్షయ్, హరీష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ యతీంద్ర రామానుజ జీయరుస్వామికి పరామర్శ

కరీంనగర్ కల్చరల్, జూలై 10: కొన్ని నెలలుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం కరీంనగర్ చేరుకున్న ఉమ్మడి జిల్లాకు చెందిన కృష్ణ యతీంద్ర రామానుజ జీయరు స్వామిని బుధవారం రాత్రి దేవనాథ రామానుజ జీయరుస్వామి పరామర్శించారు. స్వామీజీ ఆరోగ్య పరిస్థితిని పూర్వాశ్రమ కుటుంబ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్వామీజీ పూర్వాశ్రమ కుమారులు శ్రీమన్నారా యణాచార్యులు, సింహాద్రి ఆచార్యులు, జగన్నాథాచార్యులు, డాక్టర్ కె రామకృష్ణ, కుమార్తెలు శ్రీదేవి, పద్మ, కమల, గాయత్రి, వేదభవనం ప్రిన్సిపాల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యులు, ఉమ్మడి జిల్లాల శ్రీవైష్ణవ సంఘం బాధ్యులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి అనంతాచార్యులు, గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, కె వేదాంతాచార్యులు, ఎస్.వేణుగోపాలాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు, ఎస్ అనంతాచార్యులు, జి శశికిరణ్ ఆచార్యులు, కెజి వేంకట రమణాచార్యులు, రాజారాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సంఘం రజతోత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్ కల్చరల్, జూలై 10: హైదరాబాద్‌లో ఈనెల 20న జరిగే శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల శ్రీవైష్ణవ సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నీరుకుళ్ళ గ్రామంలోని శ్రీరంగనాయకస్వామి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతీ జిల్లా నుంచి ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యవర్గం సారధ్యంలో బస్సులు ఏర్పాటు చేస్తున్నారని, ప్రతీ శ్రీవైష్ణవుడు కుటుంబ సభ్యులతో కలసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి అనంతాచార్యులు, గోవర్ధనగిరి జగన్నాథా చార్యులు, కాండూరి శ్రీనివాసాచార్యులు, జి మధుసూదనాచార్యులు, వేణుగోపాలాచార్యులు, అనంతాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు, శశికిరణ్ ఆచార్యులు, శ్రీనివాసాచార్యులు, శ్రీనివాసాచార్యులు, డి శ్రీధరాచార్యులు, కెజి రమణాచార్యులు, ఎస్ శ్యామసుంద రాచార్యులు, రాజారాంమోహన్, ఆలయ అర్చకుడు జి మనోహరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో కల్వర్టు నిర్మాణం

వీణవంక,జూలై10: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షానికి యాదవకాలనీలో కల్వర్టు కూలడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా స్పందిచక పోవడంతో గ్రామస్థులు పది రోజుల తర్వాత గ్రామానికి చెందిన కొమ్మిడి రాకేష్ రెడ్డికి తెలిపారు. స్వంత ఖర్చులతో వెంటనే పైపులు తెప్పించి జెసీబీతో కల్వర్టు నిర్మించారు. గ్రామస్థులు కొమ్మిడి రాకేష్‌రెడ్డిని అభినందించారు.యువ సైన్యం సభ్యులు దాదాపు ఐదు గంటలు శ్రమించి కల్వర్టు పనులు పూర్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, జూలై 10: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పై చదువుల కోసం సర్టిఫికెట్స్ కోసం కాలేజీ వద్దకు వెళితే ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని ఫీజులు కట్టాలని తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి విద్యార్థులకు పూర్తిస్థాయి స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు అఖిల్, మల్లికార్జున్, తిరుపతి, కుమార్, సాయి, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

● ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి కుసుంబ ఆదర్శ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్య క్షుడు పోకల విజయ్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవు పాల్గొన్నారు.

● భగత్‌నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

మటన్ షాపుల్లో అధికారుల తనిఖీలు

కరీంనగర్ టౌన్, జూలై 10: నగరంలోని సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో మటన్ షాపుల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశానుసారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న షాపుల వారికి 23,600 రూపాయలు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వెంకన్న, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ స్వామి, ఎన్విరాన్‌మెంట్ టీం, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ బాల్ పోటీల్లో జాన్సన్ కోరా విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్‌స్పోర్ట్స్,జూలై 10: నగరంలోని జాన్సన్ కోరా పాఠశాల విద్యార్థులు ఈనెల చెన్నైలో జాతీయ సాయి టోర్నమెంట్ అండర్ -17 రాకెట్ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. రాష్ట్రం తరపున జాన్సన్ కోరా పాఠశాల విద్యార్థులైన టి.సౌర్యతేజ శ్రీ చరణ్, బి. శివశంకర్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి, రాకెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం కైవశం చేసుకున్నారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్‌రెడ్డి తదితరులు విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంత్, ఆనంద్‌లను శాలువా మెమొంటోలతో సత్కరించారు.

ఔషధ మొక్కలు నాటాలి

కరీంనగర్ టౌన్, జూలై 10: వన మహోత్సవంలో నాటే మొక్కలతో పాటు ఆరోగ్య ప్రదాయక ఔషధ మొక్కలు నాటాలని పర్యావరణవేత్త తోట లక్ష్మణరావు అన్నారు. బుధవారం స్థానిక లయోల కళాశాల ప్రాంగణంలో తన మనుమడు సిద్ధార్థ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి దాదాపు 30 పూల మొక్కలు నాటారు. అనంతరం తల్లి పేరిట పలు ఔషధ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు కాలుష్య వాయువులను తీసుకొని ప్రాణ వాయువును అందిస్తాయని అన్నారు. భూసారాన్ని రక్షించి, భూగర్భ జలాలను పెంచుతాయని అన్నారు. నాటిన ప్రతీ మొక్క చెట్టుగా ఎదిగేలా, నరికి వేయకుండా కాపాడేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అలెక్స్, సాంబశివరావు, అంజిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, జూలై 10: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన మ్యాథ్ అండ్ సైన్స్ పోటీపరీక్షలో సిద్ధార్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో 6, 7, 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎ.రిషిత 600 రూపాయలు, ఎ.శ్రీవిద్య 700 రూపాయలు, జె.సహస్ర 1000రూపాయలు, కె.హర్షద్ 1200రూపాయలు, కె.సాత్వికరెడ్డి 1000 రూపాయల నగదు బహుమతులు, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థు లందరికీ ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీ పరీక్షలలో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో జరుగబోయే వివిధ పోటీ పరీక్షలకు అనుగుణంగా తయారుకావచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

సుభాష్‌నగర్, జూలై 10: మూడు నెలలుగా తమ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని ఆసుపత్రి కార్మికులు సమ్మె నోటీసు అందచేశారు. బుదవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి సమ్మె నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో సానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ గార్డ్స్, ప్లంబర్‌కు సంబంది సుమారు 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిగి కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఈనెల 24న చర్చలు జరపాలని లేనియడల నిరవదిక సమ్మెలోకి వెళ్తామని, దానికి అధికారులదే పూర్తి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి ఆరుణ్, ప్రధాన కార్యదర్శి పి కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కరీంనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగులపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతర పంటలుగా సాగు చేసుకుని లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రైతులకు సబ్సిడిపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం ఉందన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో 2300 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ విధించిందన్నారు.జిల్లాలో ఇప్పటికే 1500 ఎకరాల్లో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారన్నారు. సాగు మరింత పెరిగేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటు ముందుకు వెళ్లాలరాన్నరు. ఎస్సీ ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడిపై డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. మిగతా రైతులకు 80 శాతం సబ్సిడిపై అందిస్తామన్నారు. మిగతా 20 శాతం అమౌంట్ చెల్లించేందుకు గాను రైతులకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బండారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్, కరీంనగర్ ఎడిఏ రణధీర్, చొప్పదండి ఎడిఏ సునీత, ఆయా మండ లాల ఉద్యాన వన శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్, జూలై 10: నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 26వ డివిజన్ లో మేయర్ యాదగిరి సునీల్ రావు పర్యటించారు. కిసాన్‌నగర్ ప్రాంతంలో (సమోసా ఫ్యాక్టరీ) స్థానిక కార్పొరేటర్ నక్క పద్మ కృష్ణతో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన లక్షల నిధులతో ఎస్ డబ్లుజీ డ్రైనేజీ పైపులైన్ అభివృద్ధి పనులకు భూమి పూజ పనులను ప్రారంభించారు. అనంతరం డివిజన్ లోని స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ నక్క పద్మ కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు పలు డ్రైనేజీ, రోడ్ల సమస్యలను మేయర్‌కు వివరించారు. వాటి పనులు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని మేయర్ స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాంపల్లి శ్రీనివాస్, డీఈ అయాబ్, స్థానిక డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భ్రూణహత్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్, జూలై 10: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులలో భ్రూణ హత్యలు చేస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యువజన కాంగ్రెస్ నాయకులు బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో చందుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రాలుగా భ్రూణహత్యలు చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు లేకున్నా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చిన రోగి వద్ద వివిధ పరీక్షల పేరిట దోపిడీ చేస్తున్నారన్నారు. హుజూరాబాద్‌లోని కొన్ని మెడికల్ షాపులలో నకిలీ మందులు అమ్ముతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో జమ్మికుంటలో భ్రూణ హత్య చేసిన వైద్యులు హుజూరాబాద్‌లో కొత్తగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిని నెలకొల్పారన్నారు. ఈ ఆస్పత్రిపై ఎప్పటికప్పుడు జిల్లా వైద్యాధికారులు నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో టి శ్రావణ్, జె అనిల్, ఈ చంద్రశేఖర్, సీహెచ్ విష్ణువర్ధన్ ఉన్నారు.

వన మహోత్సవం

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయిని చెరువు కట్టపై మూడు వందల మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, ఒక వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు.

● చొప్పదండి : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పరిరక్షించాలని మండల ప్రత్యేకాధికారి జయ శంకర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుక్మాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, గుమ్లాపూర్, కొలిమికుంట గ్రామాల్లో ఆయన మొక్కలను నాటారు.

ఆర్ఎంకు వినతి

రామడుగు, జూలై 10 : కరీంనగర్ నుంచి రామడుగు మండలం కోరుటపల్లి, గోపాల్‌రావుపేట, రాంభద్రునిపల్లి మీదుగా పెగడపల్లి వరకు బస్సు సౌక ర్యం కల్పించాలని కోరుతూ బుధవారం ఆర్టీసీ ఆర్ఎంకు బీజేపీ నాయకుడు ప్రభాకర్‌యాదవ్ వినతి పత్రం సమర్పించారు. గత రెండేళ్లుగా బస్సు సేవలను నిలిపివేశారన్నారు. విద్యార్థులు, రైతులు, కూలీలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బస్సును వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

పలువురు నేతలను కలిసిన స్థానిక నాయకులు



స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన దేశిని కోటి

జమ్మికుంట, జూలై 10: హుజూరాబాద్ డిపో నుంచి జమ్మికుంట, ఇక్కడి నుండి వివిధ ప్రాంతాలకు రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు రవాణ, బిసి సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే బస్సులు అన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

● జమ్మికుంట రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పోరేషన్ చైర్మన్ నియామకం అయిన జంగా రాఘవరెడ్డిని బుధవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

● జమ్మికుంట : తెలంగాణ స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డిని హైదరాబాద్‌లో ఇల్లందకుట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పిసిసి ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్‌లు కలిసి మొక్కను అందజేసి శాల్వాతో ఘణంగా సన్మానించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు దొమ్మటి వెంకన్న ఉన్నారు.

జ్యోతిష్మతిలో టాస్క్ ఆధ్వర్యంలో ముగిసిన ప్రత్యేక శిక్షణ



జ్యోతిష్మతిలో టాస్క్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తిమ్మాపూర్, జూలై10:స్థానిక జ్యోతిష్మతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్)కళాశాలలో టాస్క్(తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన పైథాన్ ప్రోగ్రాం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసినట్లు జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. మూడు రోజుల పాటు హైదారాబాద్‌కు చెందిన టాస్క్ టెక్నికల్ అసోసియేట్ ట్రైనర్ రత్నప్రియ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణతో కార్పొరేట్ సంస్థలలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందుతాయన్నారు. ఈ పైథాన్ ప్రోగ్రాంలో శిక్షణ తీసుకోవాలంటే బయట పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందన్నారు. ఇలాంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జువ్వాడి సాగర్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, విభాగాధిపతి జగదిషన్, కోఆర్డినేటర్ ఆర్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం నగర అధ్యక్షుడిగా సుమంత్



గణేశ్‌నగర్, జూలై 10: బీసీ విద్యార్థి సంఘం కరీంనగర్ నగర అధ్యక్షుడిగా తిరుమల సుమంత్‌ను నియమిస్తూ బుధవారం బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడిగా నియమితులైన తిరుమల సుమంత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించినందుకు జాతీయ అధ్యక్షులకు, నాయకులకు, రాష్ట్ర అధ్యక్షులకు, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

దత్తత ఉత్తర్వులు అందజేత

కరీంనగర్, జూలై 10(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పమేలా సత్పతి ఆయా దంపతులకు ముగ్గురు పిల్లల దత్తత ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, డిసిపిఓ శాంత, శిశు గృహ మేనేజర్, తేజస్వి ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, జూలై 10: కొత్తపల్లి పట్టణ పరిధిలోని బీడీ కార్మికుల పిల్లల చదువు కోసం 2024-25 సంవత్సరానికి గాను ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పట్టణ కార్మిక శాఖ సంక్షేమ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ టి.అనూషరాణి ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు 040-29561297 నంబరులో సంప్రదించాలన్నారు.

ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం

కరీంనగర్ అర్బన్, జూలై 10: జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర కాంగ్రెస్ మత్స్యకార విభాగం అధ్యక్షులు నాగుల శివ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని మార్కెట్ రోడ్‌లో చేపల మార్కెట్లో మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ మత్స్యకార విభాగం అధ్యక్షులు బండి మల్లేశం, రాష్ట్ర కాంగ్రెస్ మత్స్యకార ప్రధాన కార్యదర్శి నాగుల సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరీ ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై10: కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గభవాని ఆలయంలో బుధవారం అమ్మవారికి వంకాయ మాలలను అలంకరించారు. కార్యక్ర మాల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

భగత్‌నగర్, జూలై 10: ప్రజా సమస్యలపై మరింత ఉద్యతంగా పోరాటం చేస్తామని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం సీపీఎం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా రిపోర్టును ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమాసాహెబ్ పాల్గొన్నారు.

'పారమితలో' ఎన్‌సీసీ ఎంపిక పరీక్షలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 10: జిల్లా కేంద్రంలోని పారమిత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా ఎన్‌సీసీ కెడెట్లుగా ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 8వ తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొమ్మిదవ తెలంగాణ బెటాలియన్ సుబేదార్ జె సూర్యప్రసాద్, హవల్దార్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనూకర్‌రావు, వినోద్‌రావు, రమణ, ప్రసాద్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● గణేశ్‌నగర్: టీజీ ఎస్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో జూనియర్ లైనమన్ పోస్టుల కొరకు సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షకు నలుగురు అభ్యర్థులు హాజరైనట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు.

● టీజీఎన్‌పీడీసీఎల్ జిల్లా స్టోర్‌ను చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ డిటి మధుసూదన్ బుధవారం తనిఖీ చేశారు. వీరి వెంట ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ విజయేందర్‌రెడ్డి, ఏడీ కిరణ్ కుమార్, ఏడీ రఘు తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్ : కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేఖ విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు సైదాపూర్ తహసీల్దార్ మంజులాకు వినతిపత్రం అందించారు.

● గంగాధర: గంగాధరలో ప్రైవేటు భవనంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలగించుకోవాలని విద్యుత్ అధికారులు బుధవారం యాజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ భవనంలో పాఠశాల కొనసాగుతుండగా మూడురోజుల క్రితం విద్యుత్ తీగలు తెగిపడి ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి.

● గంగాధర: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాకార్యకర్తల డిమాండ్లను నెరవేర్చాలని గంగాధర ఆశాకార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశాకార్యకర్తలు నిరసన తెలిపారు.

● గన్నేరువరం: కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటియూ పిలుపు మేరకు మండలంలోని ఆశావర్కర్లు బుధవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

● తిమ్మాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి శంకర్ పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు ఎ.శీలా, కె.శ్రీనివాస్ రెడ్డి, పీఈటి రాజబాబులకు బదిలీ కాగా బుధవారం వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

● రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఉప్పు తిరుపతి తల్లి ఉప్పు వీరమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు.

● రామడుగు: మత్తు పదార్థాల భారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

● తిమ్మాపూర్ : అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘి క సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో మత్తు మాదకద్రవ్యాలపై ఇంటర్ విద్యార్థులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ బాబా, ఎక్సైజ్ ఎస్సైలు భారతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● చిగురుమామిడి: రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను బుధవారం జిల్లా వికలాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కంది నాగరాజు కలిశారు. వికలాంగుల సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

● మానకొండూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆశాకార్యకర్తల దినం సందర్భంగా మానకొండూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు బుధవారం ధర్నా చేపట్టారు. తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. సీఐటియు జిల్లా నాయకులు సుంకరి సంపత్ ,మండల అధ్యక్షురాలు ఏ. లక్ష్మి, కవిత, కే. రోజా, బి. మౌనిక పాల్గొన్నారు.